



మున్సిపల్ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి టిజి.భరత్

అభివృద్ధి పనులు

వేగవంతం కావాలి

- మంత్రి టిజి.భరత్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు మరింత వేగవంతం కావాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టిజి.భరత్ అధికారులను ఆదేశించారు. కర్నూలు కార్పొరేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులపై మంగళవారం నగరంలోని ప్రభుత్వ అతిథి గృహంలో మంత్రి టిజి.భరత్ సమీక్షించారు. అమృత్-2 పథకానికి సంబంధించి మంజూరై, నిలిచిపోయిన జగన్నాథ గట్టు మీద రూ.130 కోట్లతో 50 ఎంఎల్‌డి నీటి శుద్ధి కేంద్రం, అలాగే 21 ఈఎస్ఎల్ఆర్ ట్యాంకుల నిర్మాణ పనులు వేగవంతం కావాలని ఆదేశించారు. తుంగభద్ర నది ఒడ్డున రూ.122 కోట్లతో 35 ఎంఎల్‌డి మురుగు నీరు శుద్ధి కేంద్ర నిర్మాణానికి సంబంధించి టెండర్ల ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. తాగునీటి సరఫరా సాధ్యమైనంత రాత్రివేళల్లో కాకుండా పగలు సరఫరా చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కిడ్స్ వరల్డ్ నుంచి ఉస్మానియా కళాశాల మీదుగా కలెక్టరేట్ వరకు పెండింగ్‌లో ఉన్న రోడ్డు విస్తరణ పనులపై దృష్టి పెట్టాలన్నారు. సీజనల్ వ్యాధుల నివారణకు పారిశుధ్యంపై ఇంకా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కర్నూలు నగర పాలక సంస్థ కమిషనర్ భార్గవ తేజ, అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, పబ్లిక్ హెల్త్ ఎస్ఇ చంద్రమౌళి, నగర పాలక ఎస్ఇ డి.వేణు గోపాల్, ఎంఇలు షాకీర్, శేషసాయి, ఆరోగ్యధికారి విశ్వేశ్వర రెడ్డి, ఇన్‌ఛార్జీ సిటీ ప్లానర్ సంధ్య, మేనేజర్ చిన్నరాముడు, సెక్రటరీ నాగరాజు, హార్టికల్చర్ ఎడి విజయలక్ష్మి, టిపిఆర్ఒ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

వణికిస్తున్న జ్వరాలు

- డెంగీ కేసులే అధికం
- చర్యలు చేపడుతున్న అధికారులు
- 'ప్రయివేట్' ఆస్పత్రుల దోపిడీ

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఉమ్మడి కర్నూలు జిల్లాలో సీజనల్ జ్వరాలు వణికిస్తున్నాయి. వాటిలో డెంగీ కేసులే అధికంగా ఉన్నాయి. డెంగీ కేసులు పెరుగుతుండటంతో జిల్లా వాసులు భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు నివారణ చర్యలు చేపట్టడంలో నిమగ్నమవుతున్నారు...

సీజనల్ జ్వరాలు ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రజలను వణికిస్తున్నాయి. వ్యాపిస్తున్న జ్వరాల్లో వైరల్ జ్వరాలతో పాటు డెంగీ కేసులు అధికంగా నమోదవుతున్నాయి. డెంగీ బాధితుల సంఖ్య గణనీయంగా పెరుగుతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కేవలం దోమల ద్వారా, చల్లని వాతావరణం ఉన్నప్పుడు మాత్రమే డెంగీ వ్యాధి ప్రభలే అవకాశం ఉంటుంది. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా డ్రెయినేజీలు, మురుగు గుంటల్లో పెద్ద ఎత్తున నీరు నిలిచింది. దీంతో దోమల వ్యాప్తి పెరిగి డెంగీ విజృంభిస్తోంది. అధికారిక లెక్కల ప్రకారం కర్నూలు జిల్లాలో గతేడాది జనవరి నుంచి డిసెంబర్ వరకూ 409 డెంగీ కేసులు నమోదు కాగా ఈ ఏడాది ఇప్పటి వరకూ 193 డెంగీ కేసులు నమోదయ్యాయి. గతేడాది జనవరి నుంచి డిసెంబర్ వరకూ నాలుగు మలేరియా కేసులు నమోదు కాగా ఈ ఏడాది ఇప్పటి వరకూ నాలుగు మలేరియా కేసులు నమోదయ్యాయి. నంద్యాల జిల్లాలో గతేడాది జనవరి నుంచి డిసెంబర్ వరకూ 251 డెంగీ కేసులు నమోదు కాగా ఈ ఏడాది ఇప్పటి వరకూ 110 డెంగీ కేసులు నమోదయ్యాయి. గతేడాది జనవరి నుంచి డిసెంబర్ వరకూ 22 మలేరియా కేసులు నమోదు కాగా ఇప్పటి వరకూ రెండు మలేరియా కేసులు నమోదయ్యాయి. ఎలీసా టెస్టుల ద్వారా పాజిటివ్ వచ్చిన మాత్రమే అధికారులు డెంగీ కేసులుగా పరిగణిస్తున్నారు. అనధికారికంగా ఈ ఏడాది నమోదైన డెంగీ కేసులు వేలల్లో ఉన్నట్లు అంచనా. జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో పారిశుధ్యం లోపించడం, డ్రయినేటీ కాలువల్లో మురుగు పేరుకుపోవడంతో దోమలకు ఆవాసంగా మారుతున్నాయి. దీంతో జ్వరాలు విజృంభిస్తున్నాయి.

ప్రయివేటు దోపిడీ

వైరల్ జ్వరాలు విజృంభిస్తుండటాన్ని ప్రయివేటు ఆస్పత్రులు ఆదాయంగా మలచుకుంటున్నాయి. జ్వరం వచ్చిందని ఆస్పత్రికి వెళితే చాలు తొలుత టెస్టుల పేరుతో వేలకు వేలు దండుకుంటున్నారు. ప్లేట్‌లెట్స్(రక్తపలికలు) తగ్గాయన్న పేరుతో ఆస్పత్రిలో చేరాలని భయపెడుతున్నారు. ఆస్పత్రిలో చేరితో మందులు, బెడ్ ఛార్జీలు, డాక్టర్ ఫీజులు తదితర పేర్లతో దోచుకుంటున్నారు. ఏకంగా లక్షలు వసూలు చేస్తూ రోగుల జేబులు ఖాళీ చేస్తున్నారు.

డెంగీ లక్షణాలు ఇలా..

ఒక్కసారిగా జ్వరం రావడం, తలనొప్పి అధికంగా ఉండడం, ఎక్కువగా నొసటిపై తలనొప్పిగా ఉండడం, కంటి లోపల, కన్ను కదిలించినప్పుడు నొప్పిగా ఉండడం, కండరాలు, కీళ్లనొప్పులు ఉండడం, వాంతి అనిపించడం, నోరు ఎండిపోయి ఎక్కువ దాహంగా ఉండడం.



దోమల నివారణకు ఫాగింగ్..

పట్టణాలు, గ్రామాల్లో అధికారులు ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య చర్యలు చేపడుతున్నారు. దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టారు. దోమల లార్వాను అరికట్టడానికి డ్రెయినేజీలు, నీటి గుంటల్లో మందులు చల్లిస్తున్నారు. ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటిస్తూ ట్యాంకులు, నీటి గుంటలు, కాలువలు, డ్రమ్ములు, పూలతొట్లు, పాత టైర్లలలో నిలిచిన నీటిని పారబోయిస్తున్నారు. ఎఎన్ఎంలు, ఆశ వర్కర్లు, గ్రామపంచాయతీ, మున్సిపల్, రెవెన్యూ సిబ్బంది సమష్టిగా పనిచేస్తున్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు ఫ్లై ఓవర్ బ్రిడ్జీలు నిర్మించాలి : సిపిఎం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలో ట్రాఫిక్ నియంత్రణ కోసం ఫ్లై ఓవర్ బ్రిడ్జిలు నిర్మించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రెండవ రోజు కార్మిక కర్షక భవన్ లో జరిగిన సిపిఎం పార్టీ కార్యకర్తల విస్తృత సమావేశం ఆర్.నరసింహులు అధ్యక్షతన జరిగింది. డి.గౌస్ దేశాయ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.నిర్మల, కెవి.నారాయణ, నగర కార్యదర్శి టి.రాముడు మాట్లాడుతూ కర్నూలు నగరంలో జనాభా విపరీతంగా పెరిగి వాహనాలు పెరిగి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతూ ఆఫీసులకు వెళ్లేవారు. కాలేజీ స్కూళ్లకు వెళ్లే వారికి అనేక ఇబ్బందులు కలుగుతున్నాయని, ఈ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ట్రాఫిక్ నియంత్రణ కోసం బళ్లారి చౌరస్తా నుండి సి.క్యాంప్ సెంటర్ వరకు పాత బస్టాండ్ నుండి రాజవిహార్ సెంటర్ వరకు ఫ్లైఓవర్ బ్రిడ్జిలు నిర్మించాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా కర్నూలు నగరంలో మంచినీళ్ల వండు నీళ్ళు వస్తున్నాయని ఇవి తాగడం వల్ల ప్రజలు అనారోగ్యాలకు గురి అవుతున్నారని తెలిపారు. శుద్ధి చేసిన మంచినీటిని సరఫరా చేయాలని మున్సిపల్ అధికారులను కోరారు. వర్షాలు ప్రారంభమవుతున్నాయని దీనివల్ల కర్నూలు నగరంలో దోమల బెడద ఎక్కువగా ఉందని దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. నగరంలో జనాభా కనుగుణంగా రోడ్ల విస్తరణ చేపట్టాలని తెలిపారు. కర్నూలు నగరానికి సరిపడ పారిశుధ్య కార్మికులను పెంచి పారిశుధ్యం మెరుగుపరచుటకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో సిపిఎం నగర కార్యవర్గ సభ్యులు సిహెచ్.సాయిబాబా, కె .సుధాకరప్ప, నగరకమిటీ సభ్యులు ఎస్.మహమ్మద్ రఫీ, హుస్సేన్‌బాష, కె.ప్రభాకర్ కె,అరుణ, శ్యామల, ధనలక్ష్మి, యేసు, వివిధ కాలనీల నుండి కార్యకర్తలు హాజరయ్యారు.

పిఎం విశ్వకర్మ

దరఖాస్తుల పరిశీలన

- కలెక్టర్ పి.రంజిత్ బాషా

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం కింద దరఖాస్తు చేసుకున్న ప్రక్రియ పూర్తి చేయాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. మంగళవారం పరిశ్రమల శాఖపై కలెక్టర్ సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఎపిఐఐసి కార్యక్రమాల గురించి జోనల్ మేనేజర్ సోమశేఖర్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్‌కు వివరించారు. కర్నూలు జిల్లాలో ఎపిఐఐసికి సంబంధించి 9074.52 ఎకరాల ల్యాండ్ బ్యాంక్ ఉందని తెలిపారు. ఓర్వకల్లు ప్రాంతంలో ఏర్పాటు చేసిన పరిశ్రమలు, గుట్టపాడు క్లస్టర్, ఎంఎస్ఎంఈల గురించి వివరించారు. ల్యాండ్ బ్యాంక్‌కు సంబంధించి ఏ ప్రాంతంలో ఎంత ల్యాండ్ ఉందని కలెక్టర్ అధికారులను ఆరా తీశారు. ఓర్వకల్లు పారిశ్రామిక వాడకు నీటి సరఫరా కోసం ముచ్చుమర్రి నుంచి మంజూరైన పైపులైన్ పనుల పురోగతిని గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. ఎపిఐఐసి భూములకు సంబంధించి మార్ట్ గేజ్ చేసే ప్రక్రియపై రాష్ట్రస్థాయి నుంచి ఉత్తర్వులు రూపొందించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఎపిఐఐసి జడ్ఎంను ఆదేశించారు. ఆ మేరకు ఉన్నతాధికారులకు లేఖ రాయాలని సూచించారు. మ్యూటేషన్‌లు ఎవరి పేరుతో ఉండాలో కూడా ఎపిఐఐసినే నిర్ణయించాలని తెలిపారు. జెసి నారపురెడ్డి మౌర్య, డిఆర్ఒ మధుసూదన్ రావు, కర్నూలు ఆర్‌డిఒ శేషిరెడ్డి, ఎపిఐఐసి జడ్ఎం సోమశేఖర్ రెడ్డి, పరిశ్రమల శాఖ జిఎం ప్రసాద్, ఓర్వకల్లు తహశీల్దార్ నటరాజ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

ఆర్‌టిసి బస్టాండ్‌ను నంబర్ వన్ గా తీర్చిదిద్దుతాం

స్టార్ లైనర్, సూపర్‌లగ్జరీ బస్సులను ప్రారంభించిన మంత్రి టిజి.భరత్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు ఆర్‌టిసి బస్టాండ్ రాయలసీమలో నంబర్‌వన్ గా తీర్చిదిద్దుతానని మంత్రి టిజి. భరత్ అన్నారు. ప్రయాణీకుల సౌకర్యార్థం, మంగళవారం కర్నూలు-1 డిపో గ్యారేజీలో 2 స్టార్ లైనర్ బస్సులు, 4 కొత్త సూపర్ లగ్జరీ బస్సుల ప్రారంభించారు. ఎంపి బస్తిపాడు నాగరాజు , మంత్రి టిజి. భరత్ ఈ బస్సులను రిబ్బన్ కత్తిరించి, జెండా ఊపి ప్రారంభించారు. రెండు స్టార్ లైనర్ బస్సులు , రెండు సూపర్ లగ్జరీ బస్సులు బెంగళూరు రూటులో, రెండు సూపర్ లగ్జరీ బస్సులు తిరుపతి రూటులో తిప్పుతామన్నారు. టిజి.భరత్ మాట్లాడుతూ ఆర్‌టిసి అధికారులతో సమీక్ష జరిపి కర్నూలు బస్టాండ్‌ను అభివద్ధి చేసి రాయలసీమలో నంబర్-1 బస్టాండ్‌గా తీర్చిదిద్దుతామని అన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం కర్నూలు ఎయిర్‌పోర్టు నుండి విజయవాడకు విమాన సర్వీసులను ప్రారంభించేందుకు కృషి చేస్తానన్నారు. ఎంపీ బస్తిపాదు నాగరాజు మాట్లాడుతూ చంద్రబాబు సహాయ సహకారాలతో కర్నూలు బస్టాండ్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణా అధికారి శ్రీనివాసులు , కర్నూలు-1డిపో మేనేజరు సుధారాణి, కర్నూలు-2 డిపో మేనేజరు సర్దార్ హుస్సేన్, కర్నూలు-1, కర్నూలు-2 డిపోల అసిస్టెంట్ మేనేజర్లు, సూపర్వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



స్టార్‌లైనర్, సూపర్ లగ్జరీ బస్సులను ప్రారంభిస్తున్న మంత్రి భరత్, ఎంపి నాగరాజు

కల్లూరు వార్డుల సమస్యలను పరిష్కరించాలి

పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగర పాలక సంస్థ పరిధిలోని కల్లూరు వార్డుల సమస్యలను పరిష్కరించాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి అన్నారు. మంగళవారం ఎస్‌బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగర పాలక సంస్థ నూతన కౌన్సిల్ హాలులో కమిషనర్ ఎ.భార్గవ్ తేజతో కలిసి నగరపాలక అధికారులతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. వీధి దీపాల మరమ్మతులు, పూడికతీత పనులు, పూర్తిగా అధ్వానమైన రోడ్లను వెంటనే మెటల్ రోడ్డు, పందులు, కుక్కల బెడద తగ్గింపునకు చర్యలు, తాగునీటి సరఫరా సమయం పెంపు వంటి పలు అంశాలపై ఎమ్మెల్యే, అధికారులతో చర్చించారు. సమావేశంలో అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, ఎస్ఇ వేణుగోపాల్, ఎంఇలు షాకీర్, శేషసాయి, ఆరోగ్య అధికారి విశ్వేశ్వర రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ఆర్ఒ జునైద్, కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.





జిజిహెచ్‌లో చికిత్స పొందుతున్న టిడిపి నాయకుడిని పరామర్శిస్తున్న కోట్ల

టిడిపి నాయకుడిని పరామర్శించిన ఎమ్మెల్యే కోట్ల

ప్రజాశక్తి -కర్నూలు హాస్పిటల్


కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల న్యూరో సర్జరీ విభాగంలో చికిత్స పొందుతున్న టిడిపి నాయకులు మద్దయ్యను డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి మంగళవారం పరామర్శించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర రెడ్డి మాట్లాడుతూ కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో న్యూరో సర్జరీ విభాగానికి డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాష్‌రెడ్డి సందర్శించి పేషెంట్ల ఆరోగ్యం పై పరామర్శ చేశారు. ఆసుపత్రిలోని న్యూరో సర్జరీ విభాగంలో చికిత్స పొందుతున్న మద్దయ్యను పరామర్శించి అనంతరం పేషెంట్లకు అందుతున్న ట్రీట్‌మెంట్ , సదుపాయాల గురించి ఆసుపత్రి సూపరిండెంట్ ద్వారా ఆరా తీశారు. అనంతరం పేషంట్లకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. సిఎస్ఆర్ఎంఒ డాక్టర్ వెంకటేశ్వరరావు, న్యూరో సర్జరీ విభాగధిపతి డాక్టర్ రామ్ బాలాజీ నాయక్, డిప్యూటీ సిఎస్ఆర్ఎంఒ డాక్టర్ హేమమాలిని, ఎఆర్ఎంఆర్ డాక్టర్ వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ డాక్టర్ శివబాల నగాంజన్, డాక్టర్ కిరణ్ కుమార్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

గొడవలు సృష్టిస్తే చర్యలు

పత్తికొండ అర్బన్ సిఐ మురళీమోహన్

ప్రజాశక్తి- పత్తికొండ:

కుల ,మత, రాజకీయ ఆధిపత్యం కోసం గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పత్తికొండ అర్బన్ సిఐ మురళీమోహన్ పేర్కొన్నారు. మంగళవారం పత్తికొండ పోలీస్ స్టేషన్‌లో ప్రజాశక్తి తో మురళీమోహన్ మాట్లాడుతూ పత్తికొండ మండలం గ్రామీణ ప్రాంతాలలో ఈనెల 14న 26 చోట్ల మొహర్రం వేడుకలను జరుపుకుంటారన్నారు. మొహర్రం నిర్వహణ కమిటీ సభ్యులు పండుగ వేడుకలకు ముందస్తుగా పోలీస్ స్టేషన్‌లో పర్మిషన్ తీసుకోవాలని అన్నారు. గతంలో జరిగిన గొడవలను దృష్టిలో ఉంచుకొని హోసూరు, పందికోన గ్రామాలలోని పీర్ల స్వాములకు ప్రత్యేక పూజలు మాత్రమే జరుపుకోవాలని అన్నారు. సోదర భావంతో ప్రశాంతంగా పండగ వేడుకలను జరుపుకోవాలని అన్నారు. పీర్ల స్వామిగుడి దగ్గర సిసి కెమెరా తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. ఎవరైనా గ్రామాలలో అసాంఘిక కార్యక్రమాలు, రెచ్చగొట్టే మాటలు మాట్లాడినా, అట్టి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



జిజిహెచ్‌లో పర్యటించిన కర్నూలు ఎంపీ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో కర్నూలు పార్లమెంటు సభ్యులు బస్తిపాటి నాగరాజు మంగళవారం పర్యటించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి ప్రభాకర రెడ్డి మాట్లాడుతూ కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో కర్నూలు పార్లమెంట్ సభ్యులు బస్తిపాటి నాగరాజు కార్డియోథొరాసిక్, ఐసియు కార్డియాలజీ వార్డు, డయాలసిస్ విభాగాలను పరిశీలించామని తెలిపారు. కర్నూలు పార్లమెంట్ సభ్యులు బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ ఆసుపత్రి పలు విభాగాలను ఆకస్మికంగా తనిఖీ చేసి అనంతరం పేషెంట్లకు అందుతున్న ట్రీట్‌మెంట్ , సదుపాయాల గురించి ఆసుపత్రి సూపరిండెంట్ ద్వారాఆరా తీశారు. అనంతరం పేషంట్లకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వారు సూచించారు. కార్డియోథొరాసిక్ విభాగంలో ఉన్న బైపాస్ సర్జరీ పేషంట్ల వైద్య సేవలు గురించి ఆరా తీశారు. అనంతరం కార్పొరేట్ స్థాయిలో లేని వైద్య పరికరాలు ఇక్కడ ఉన్నాయని వారు తెలిపారు. ఆస్పత్రిలో త్వరలో హాస్పిటల్ డెవలప్‌మెంట్ కమిటీ ఏర్పాటు చేసి ఆసుపత్రికి కావాల్సిన నిధులు , మ్యాన్ పవర్ గురించి చర్చిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఎస్ఆర్ఎంఒ డాక్టర్ వెంకటేశ్వరరావు, డిప్యూటీ సిఎస్ఆర్ఎంఒ డాక్టర్ హేమనలిని, ఎఆర్ఎంఒ డాక్టర్ వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ డాక్టర్ శివబాల నగాంజన్, డాక్టర్ కిరణ్ కుమార్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



రోగి ఆరోగ్యం గురించి తెలుసుకుంటున్న ఎంపీ బి.నాగరాజు, డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి

నాడు నేడు కింద నిర్మించిన భవనాలు ప్రారంభం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

నగరంలోని స్థానిక ప్రభుత్వ టౌన్ మోడల్ జూనియర్ కళాశాలలో నాడు నేడు రెండో విడత కింద చేపట్టిన భవన నిర్మాణ పనులను మంగళవారం ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా జిల్లా వృత్తి విద్యాధికారి పరమేశ్వర్ రెడ్డి ఆర్ఐఒ గురువయ్య శెట్టి, కాలేజీ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ కృష్ణారెడ్డి పాల్గొని హెరిటేజ్ భవనం రేనోవేషన్ వర్క్ పూర్తయిన భవనాలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సి సుంకరన్నతో పాటు కళాశాల సీనియర్ అధ్యాపకులు అతావుల్లా రెహమాన్ ఎన్ జలగంగాధర్ , కాలేజ్ స్టాఫ్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కూటమి ప్రభుత్వం రజక వృత్తిదారులకు ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని జిల్లా కార్యదర్శి సి.గురుశేఖర్ నూతన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం కర్నూలు న్యూ సిటీ కమిటీ సమావేశం కొత్త బస్టాండ్ దగ్గర గల ఐలమ్మ కార్యాలయంలో అధ్యక్షుడు సి.రాముడు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి సి.గురిశేఖర్, న్యూసిటీ కార్యదర్శి సి.శేషాద్రి, మాట్లాడుతూ రజకులకు సామాజిక రక్షణ చట్టం రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. రజక సంక్షేమ - అభివృద్ధి కార్పొరేషన్‌కు విధివిధానాలు రూపొందించి నిధులు మంజూరు చేయాలన్నారు. లాండ్రీ వృత్తి నిర్వహణకు నెలకు 250 యూనిట్లు కరెంటు ఉచితంగా మంజూరు చేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రజక వృత్తి దారులపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలు, అక్రమ కేసులు ,రజక మహిళలపై జరుగుచున్న అత్యాచార హత్యలు నివారణకు రజకులకు సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని గత అనేక సంవత్సరాల నుండి ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో జరుపుతున్న ఆందోళన, పోరాటాల ఫలితంగా 2024 సాధారణ ఎన్నికలలో రాష్ట్రంలోని తెలుగుదేశం, బిజెపి ,జనసేన కూటమి ప్రభుత్వం తన ఎన్నికల (మేనిఫెస్టో) ప్రణాళికలలో బిసి తరగతులకు సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేస్తానని, 50 సంవత్సరాలు వయసు నిండిన ప్రతి వృత్తిదారునికి వృద్ధాప్య పెన్షన్ మంజూరు చేస్తానని, వృత్తి నిర్వహణకు అవసరమైన ఆదరణ పరికరాలు అందిస్తామని, రజక సంక్షేమ-అభివృద్ధి కార్పోరేషన్‌కు విధివిధానాలు రూపొందించి,నిధులు కేటాయించి రజకుల అభివృద్ధికి కషి చేస్తామని ప్రణాళికలో పేర్కొన్న హామీలను వెంటనే అమలు జరిపే విధంగా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈనెల 22 నుండి జరిగే శాసనసభ సమావేశాల్లో రజక కార్పోరేషన్‌కు రూ.వెయ్యి కోట్ల బడ్జెట్ కేటాయించి గతంలో సొసైటీలను కార్పొరేషన్‌లో విలీనం చేసి సొసైటీల ద్వారా బ్యాంకుతో నిమిత్తం లేకుండా 90శాతం సబ్సిడీతో రుణాలు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. నగర నాయకులు మద్దిలేటి, ఎల్లయ్య, వీరేష్, నెట్టికంటయ్య, వెంకటేశ్వర్లు, చంద్రన్న, పకీరప్ప, పద్మ, కురుమూర్తి, రంగన్న,తదితర సంఘం నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గురుశేఖర్



ఓర్వకల్లు రైతులతో మాట్లాడుతున్న జెసి నారపురెడ్డి మౌర్య

రైతులకు న్యాయమైన పరిహారం

ఓర్వకల్లు రైతులతో జెసి నారపురెడ్డి మౌర్య

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ప్రాజెక్టు 765 కేవి కర్నూలు-3 పవర్ లైన్‌ల నిమిత్తం రైతుల నుండి సేకరించు భూములకు సరైన విలువ కట్టి పరిహారం చెల్లిస్తామని జిల్లా సంయుక్త కలెక్టర్ నారపు రెడ్డి మౌర్య తెలిపారు. మంగళవారం ఓర్వకల్లు మండలానికి చెందిన రైతులతో ఆమె నిర్వహించారు. రైతులు అధిక మొత్తంలో పరిహారం చెల్లించాలని కోరారు. ఒక టవర్ ఏర్పాటు నిమిత్తం దాదాపు 7 సెంట్లు , ఇతర అవసరాల నిమిత్తం దాదాపు 0.50 ఎకరాలు భూమి కూడా సేకరించామన్నారు. వీటికి తగిన పరిహారం ఇచ్చే విధంగా, అందరికి మంచి చేసే చర్యలు తీసుకుంటామని రైతులకు సూచించారు. పవర్ గ్రిడ్ కార్పొరేషన్ సీనియర్ జనరల్ మేనేజర్ ఎస్‌కె.చౌహన్, డిజిఎం జి.నాగరాజు , కర్నూలు ఆర్‌డిఒ శేషిరెడ్డి ,రెవెన్యూ ల్యాండ్ అక్విషన్ అధికారులు పాల్గొన్నారు.

కౌలు రైతులను గుర్తించండి : ఎఒ

ప్రజాశక్తి- వెల్దుర్తి

వెల్దుర్తి మండలం గ్రామస్థాయిలో విధులు నిర్వహిస్తున్న రైతు సేవా కేంద్రాల సిబ్బందితో మండల వ్యవసాయ అధికారి అక్బర్ బాషా, ఎఇఒ విలసిత సమావేశం నిర్వహించారు. గ్రామాలలో అర్హులైన కౌలు రైతులను గుర్తించి గ్రామ విఆర్ఒ ద్వారా కౌలు కార్డులను జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని రైతు సేవా కేంద్రం సిబ్బందికి ఆదేశించారు. కౌలు రైతులకు కౌలు కార్డు ఇవ్వడం వల్ల భూ యజమానులకు ఎటువంటి నష్టం జరగదని అన్నారు. కౌలు రైతులు కౌలుకార్డు పొందడం వల్ల వ్యవసాయ రాయితీ పథకాలకు అర్హులౌతారన్నారు. కౌలు పై భూములను సాగుచేస్తున్న కౌలు రైతులు మీ గ్రామంలోని రైతు సేవా కేంద్రాన్ని సంప్రదించి కౌలు కార్డులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఉచితంగా పొద్దుతిరుగుడు విత్తనాలు: అన్ని గ్రామాలలో ఉచితంగా ప్రభాత్ (ఎన్‌డిఎస్‌హెచ్ 1012) రకానికి చెందిన ప్రొద్దుతిరుగుడు విత్తనాలు రైతు సేవా కేంద్రాలలో అందుబాటులో ఉన్నాయి. కావలసిన రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి తెలిపారు.

మంత్రి లోకేష్‌ను కలిసిన ఎమ్మెల్యే దస్తగిరి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్: విజయవాడలోని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, మానవరుల శాఖ మాత్యులు, సాంకేతిక పరిజ్ఞాన మాత్యులు నారా లోకేష్‌ని ఆయన స్వగృహం నందు కోడుమూరు తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే బొగ్గల దస్తగిరి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు. ఆయన కలిసిన వారిలోఎన్నికల పరిశీలకులు రామలింగారెడ్డి ఉన్నారు.


పోలీసులకు ఆరోగ్యరక్షను అందిస్తున్న మల్లెల ఆల్ఫ్రెడ్ రాజు

పోలీసులకు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలో డీఎస్పీ కార్యాలయంలో పోలీసు సిబ్బందికి ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. లిటిల్ ఫ్లాక్ ట్రస్ట్ డైరెక్టర్ జిబి.ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరయిన డాక్టర్ అరుణ్ కుందవరం మాట్లాడుతూ... పోలీసు లేని సమాజాన్ని ఊహించుకోలేమని తెలిపారు. పోలీసుల కర్తవ్యం గొప్పదని, వారు నిరంతరం పని చేసే వారని చెప్పారు. ప్రతి సీజన్‌లో వారు బయట ఉండి ప్రజల కోసం, దేశం కోసం పాటు పడుతున్నారని తెలిపారు. వారి ఆరోగ్యం బాగుండాలని ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. సీజనల్ వ్యాధులైన డెంగీ, చికున్‌గున్యా, మలేరియా, ఫ్లూ, లెప్టి స్పైరిసిస్, టైఫాయిడ్, కలరా వంటి వ్యాధులు రాకుండా పోలీసు సిబ్బందికి హోమియో మందులు పంపిణీ చేశామన్నారు. రూరల్ సిఐ మోహన్ రెడ్డి మాట్లాడుతూ... వైద్యుల సూచనలు తమకు చాలా ఉపయోగకరమన్నారు. పోలీసులు పని ఒత్తిడి కారణంగా ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా ఆరోగ్య సూచనలు పాటించాలని తెలిపారు. సామాజిక కార్యకర్త మల్లెల ఆల్ఫ్రెడ్ రాజు మాట్లాడుతూ... ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహించిన ప్రవీణ్‌కు, మంచి మనసుతో ఇక్కడికి వచ్చిన డాక్టర్ అరుణ్‌కు, సహకారమందించి ప్రోత్సహించిన సిఐ ధన్యవాదాలు తెలిపారు. డాక్టర్ అరుణ్‌కు బెస్ట్ డాక్టర్ అవార్డును కర్నూలుకు చెందిన హోమియో వైద్య నిపుణులు, వెల్ నెస్ హోమియో క్లినిక్స్ ఇంటర్నేషనల్ సిఇఒ డాక్టర్ అరుణ్ కుందవరంకు ప్రదానం చేశారు. లిటిల్ ఫ్లాక్ ట్రస్ట్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్, ఎస్ఐ రమేష్ బాబు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక విధానంతో
కార్మికులకు ఉపాధి
- టిడిపి నాయకులు రాఘవేంద్ర రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న రాఘవేంద్ర రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ ప్రకారం ప్రవేశ పెట్టిన ఉచిత ఇసుక విధానంతో కార్మికులకు ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయని టిడిపి నియోజకవర్గ నాయకులు ఎన్.రాఘవేంద్ర రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని మాధవరం గ్రామంలోని ఆయన స్వగృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టిడిపి ప్రభుత్వం విడుదల చేసిన జిఒ 43తో ప్రజలకు ఉచితంగా ఇసుక అందుబాటులోకి వచ్చిందని చెప్పారు. జగన్ ప్రభుత్వంలో పేదలు ఇల్లు కట్టుకోవడానికి రూ.5 లక్షలు ఖర్చు అయ్యేదని తెలిపారు. అందులో ఇసుకకే రూ.3 లక్షలు ఖర్చు పెట్టాల్సి వచ్చేదని చెప్పారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ఇసుక మాఫియా నడిపిందని, ఒక్క ఇసుక కుంభకోణం ద్వారానే రూ.50 వేల కోట్లకు పైగా కొల్లగొట్టారని విమర్శించారు. స్వయంగా వైసిపి నేతలే ఇసుకాసురులై దోచుకున్నారని తెలిపారు. గృహ నిర్మాణ శాఖ సరఫరాల పేరుతో 98 లక్షల టన్నుల ఇసుకను జగన్ అండ్ కో మింగేసిందని మండిపడ్డారు. ఇసుక అక్రమ తవ్వకాలను నిరోధిస్తూ.. రాష్ట్ర ప్రజల ప్రగతే ధ్యేయంగా ఈ విధానం రూపొందించారని కొనియాడారు. కోసిగి మాజీ సర్పంచి ముత్తురెడ్డి, పల్లెపాడు రామిరెడ్డి, తోవి రామకృష్ణ, బసలదొడ్డి ఈరన్న, వీరేష్ పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథంతో
భౌతిక వాదం వైపు నిలబడాలి
- సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఆనంద్‌బాబు

ప్రజాశక్తి - పెద్దకడబూరు


మాట్లాడుతున్న ఆనంద్‌బాబు

శాస్త్రీయ దృక్పథం ఉన్న భౌతికవాదం వైపు సిపిఎం సభ్యులు నిలబడాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎమ్‌డి.ఆనంద్ బాబు తెలిపారు. మంగళవారం పెద్దకడబూరులో కౌతాళం, కోసిగి, పెద్దకడబూరు మండలాల సమావేశం సీనియర్ నాయకులు మల్లయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నేడు పాలకులు ప్రజలకు శాస్త్రీయతను దూరం చేసి మతం, విశ్వాసాల ద్వారా భావవాదం నింపి ప్రశ్నించే తత్వాన్ని దూరం చేస్తున్నారని తెలిపారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వెంకటేశులు, పెద్దకడబూరు మండల కార్యదర్శి తిక్కన్న, నాయకులు పరమేష్, హనుమంతు, కోసిగి నాయకులు రాముడు పాల్గొన్నారు.

ఊరిస్తున్న మేఘాలు...
- వాడుమొహం పడుతున్న పంటలు - పంటల రక్షణపై అధికారుల సూచనలు

ప్రజాశక్తి - గోనెగండ్ల

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో మొదట వర్షాలు కురిశాయి. ఈ వర్షాలతో రైతులు పంటలను సాగు చేశారు. రోజులు గడిచేకొద్దీ వర్షాలు ముఖం చాటేశాయి. రోజూ మేఘావృతమై రైతులను ఊరిస్తున్నాయి. తప్ప కురవడం లేదు. దీంతో పంటలు వాడుముఖం పడుతున్నాయి. కొన్ని పంటలు గిడసబారుతున్నాయి.

ఎమ్మిగనూరు డివిజన్ పరిధిలో మొత్తం 67,148 హెక్టార్ల సాగు భూమి ఉంది. గోనెగండ్ల మండలంలో సుమారు 17,680 హెక్టార్ల సాగు భూమి ఉంది. మే, జూన్ మొదట్లో వర్షాలు ఆశాజనకంగా కురిశాయి. దీంతో ఈఏడాది ఖరీఫ్ సీజన్‌లో గోనెగండ్ల మండలంలో రైతులు పంటలను సాగు చేశారు. బోరుబావులు లాంటి నీటి వనరులున్న చోట, కొన్ని చోట్ల వర్షాధారంపై ప్రధానంగా వేరుశనగ, పత్తి, కంది, ఉల్లి పంటలను సాగు చేశారు. డివిజన్ పరిధిలో సుమారు 33 వేల హెక్టార్లలో పత్తి, 3 వేల హెక్టార్లలో వేరుశనగ సాగు చేశారు. అందులో గోనెగండ్ల మండలంలో 9 వేల హెక్టార్లలో పత్తి, 900 హెక్టార్లలో వేరుశనగ సాగు చేసినట్లు వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటివరకు మండలంలో సుమారు 53 శాతం మాత్రమే పంటలు సాగయ్యాయి. ఈ పంటలు రెండు దశల్లో 35 నుంచి 45 రోజుల మధ్య ఉన్నాయి. జూన్ చివరి నుంచి ఇప్పటి దాకా సరైన వర్షం కురవలేదు. రోజూ మేఘాలు కురిసేలా కనిపించి రైతులను ఊరిస్తున్నాయి. తప్ప వర్షం కురవడం లేదు. మరోవైపు వర్షలేమి, పెరిగిన గాలి తీవ్రతకు పత్తి పంట పెరుగుదల లేక గిడస బారింది. వేరుశనగ పంటలు వాడుమొహం పట్టాయి. దీనికి తోడు పత్తి, వేరుశనగ, కంది పంటల్లో కొన్ని రకాల పురుగుల ఉధృతిని కూడా గుర్తించినట్లు ఎమ్మిగనూరు ఎడిఎ మహ్మద్ ఖాద్రీ, గోనెగండ్ల ఎఒ హేమలత తెలిపారు. కొన్ని రకాల బెట్ట నివారణ పద్ధతులు, పురుగుల ఉధృతి నుంచి పంటలను కాపాడుకునే సస్యరక్షణ చర్యలను వారు రైతులకు వివరించారు.


వాడుపట్టిన వేరుశనగ పంట

బెట్టనివారణ చర్యలు

వర్షం కురిసే వరకు వర్షాభావ పరిస్థితులను తట్టుకుని పంటలను కాపాడుకోవడానికి పొటాషియం నైట్రేట్ 5 గ్రాములు 1 లీటర్ నీటిలో కలుపుకొని పత్తి, వేరుశనగ, కంది పంటలకు పిచికారి చేసుకోవాలి. పది రోజుల వరకు బెట్ట పరిస్థితుల నుంచి పంటలను కాపాడుకోవచ్చు.

పురుగు నివారణ సస్యరక్షణ చర్యలు

పత్తి పంటలో ప్రధానంగా మెగ్నీషియం ధాతులోపాన్ని గుర్తించినట్లు వ్యవసాయ శాఖాధికారులు తెలిపారు. దీని నివారణకు 10 గ్రాముల మెగ్నీషియం సల్ఫేట్ లీటర్ నీటిలో కలుపుకొని పది రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేసుకోవాలి. వేరుశనగ పంటకు ఎకరాకు 200 కిలోల జిప్సం వేసుకోవాలి. అధిక దిగుబడితో పాటు గింజలో నూనె శాతం అధికంగా ఉంటుంది. ఈ పంటల్లో ప్రధానంగా రసం పీల్చే (పచ్చదోమ, పేనుబంక, తామర) పురుగుల నివారణకు వేపనూనె 10000 పిపిఎం ఎకరాకు 400 మిల్లీలీటర్లు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలి. ఎకరాకు 25 నీలి, 25 పసుపు రంగు జిగురు అట్టలను పొలంలో పెట్టుకోవాలి. అవసరాన్ని బట్టి రసాయనిక పురుగుమందులైన ఇమిడా క్లోప్రిడ్ 40 మిల్లీలీటర్లు లేదా ఎసిటామిప్రిడ్ 40 గ్రాములు లేదా దయో మిదాక్జమ్ 40 గ్రాములు కలిపి పిచికారి చేసుకోవాలి. వేరుశనగ పంటలో ప్రధానంగా ఆకుచుట్ట పురుగు నివారణకు ప్రొఫెనో ఫాస్ 2 మిల్లీలీటర్లు లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. రైతులందరూ ఈ చర్యలను పాటించి పంటలను బెట్ట నుంచి కొద్దిరోజుల వరకు నిలబెట్టుకోవచ్చు. పంటల్లో ఆశించిన వివిధ రకాల పురుగుల ఉధృతిని కూడా నివారించుకొని పంటలను సంరక్షించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.


ఎఒ హేమలత, ఎడిఎ మహ్మద్ ఖాద్రీ



మాట్లాడుతున్న డాక్టర్ కిరణ్ కుమార్

ఉచిత శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి
- డాక్టర్ కిరణ్ కుమార్

ప్రజాశక్తి - ఆదోని

ఆదోనిలోని సాష తల్లిబిడ్డల నర్సింగ్ హోంలో ఈనెల 14న నిర్వహించే సంతాన సాఫల్య ఉచిత శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని నర్సింగ్ హోమ్ అధినేత డాక్టర్ కిరణ్ కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నో సంవత్సరాలు సంతానం కలుగక బాధపడుతున్న దంపతులకు ఇదొక మంచి అవకాశమన్నారు. భార్యభర్తలకు ఉచిత ఒపి కౌన్సెలింగ్, స్కానింగ్ నిర్వహిస్తామని తెలిపారు. భార్యభర్తలను ఇద్దరినీ పరీక్షించి వీర్యం విశ్లేషణ పరీక్షపై 50 శాతం ఫీజు తగ్గింపు ఇస్తున్నట్లు చెప్పారు. ఈ వైద్య శిబిరానికి ప్రముఖ స్త్రీ, ప్రసూతి వైద్యనిపుణులు డాక్టర్ సిఆర్.రేష్మ హాజరై పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఆసక్తి గల దంపతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎస్‌కెడి కాలనీ జీరో రోడ్డులో ఉన్న సాష నర్సింగ్ హోమ్‌లో (సాయి కళాశాల పక్కన) ఈ ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని వివరించారు.

ఉచిత ఇసుక పాలసీ హర్షణీయం
- టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి గుడిసె కృష్ణమ్మ



ప్రజాశక్తి - ఆదోని

రాష్ట్రంలో ఉచిత ఇసుక పాలసీపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిఒ జారీ చేయడం హర్షణీయమని టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి గుడిసె ఆది కృష్ణమ్మ తెలిపారు. మంగళవారం ఆమె ఆదోనిలో మాట్లాడారు. రాష్ట్రంలో ఉచిత ఇసుక పాలసీపై జిఒ జారీ చేసినట్లు తెలిపారు. వినియోగదారులకు ఇసుకను అందుబాటులోకి తేవడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. జిల్లా ఇసుక కమిటీల్లో ఎస్పీ, జెసి సహా వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు ఉంటారని చెప్పారు. ఇసుక లోడింగ్, రవాణా చార్జీలను నిర్ధారించే బాధ్యతను జిల్లా కమిటీకి అప్పగిస్తూ నిర్ణయం తీసుకుందన్నారు. స్టాక్ పాయింట్ల వద్ద లోడింగ్, రవాణా చార్జీల చెల్లింపులను కేవలం డిజిటల్ విధానం ద్వారా జరపాలని ప్రభుత్వం స్పష్టం చేసిందన్నారు. ఇసుకను తిరిగి విక్రయించినా, ఇతర రాష్ట్రాలకు తరలించినా కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. ఇసుక అక్రమ రవాణా చేసినా, ఫిల్లింగ్ చేసినా పెనాల్టీలను నిర్ధారిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి
- సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని సిపిఎం నాయకులు పి.గోవిందు కోరారు. మంగళవారం సిపిఎం నాయకులు సందర్శించి బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు పి.గోవిందు, సుభాన్, ఇస్మాయిల్, హనుమంతు గౌడ్, బాష మాట్లాడారు. పట్టణంలోని కటిక పేట ఇంటి నెంబర్ 14-3 (11 వార్డు)లో నివాసముంటున్న కటిక జైనాబి, కటిక సుభాన్ కొట్టం ఈనెల 8న దగ్ధమైందని తెలిపారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో అగ్ని ప్రమాదం జరిగిందని చెప్పారు. ఇంట్లో ఉన్న వస్తువులు, సామగ్రి, బట్టలు, బియ్యం, మిర్చి (30కిలోలు), పొదుపు డబ్బులు రూ.60 వేలు కాలి బూడిదయ్యాయని తెలిపారు. జైనాబీ కోడలు రిజ్వాన పొదుపు సంఘం లీడర్ అని, ఆమె పొదుపు కట్టడానికి పెట్టుకున్న రూ.60 వేలు కాలి బూడిదయ్యాయని చెప్పారు. ఈ పొదుపు డబ్బులు కెనరా బ్యాంకులో వాయిదాల పద్ధతిలో కట్టాల్సి ఉందన్నారు. ప్రభుత్వం స్పందించి జైనాబీ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. జైనాబీకి పింఛను ఇవ్వాలని, ఇల్లు నిర్మించుకోవడానికి రూ.5 లక్షల రుణం పూర్తి సబ్సిడీతో ఇవ్వాలని కోరారు. బట్టలు, వస్తువులు, బియ్యం కొనుగోలుకు ప్రభుత్వమే రూ.లక్ష సహాయం చేయాలన్నారు. బ్యాంకు నుంచి తీసుకున్న పొదుపు రుణాలను మాఫీ చేయాలని కోరారు. మైనార్టీ కార్పొరేషన్ తరపున చిన్న వ్యాపారం చేసుకోవడానికి ఆర్థిక సహాయం అందించాలని తెలిపారు. తహశీల్దార్ దగ్ధమైన ఇంటిని సందర్శించి ఆదుకోవాలని కోరారు.


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న నాయకులు

చంద్రన్న బీమాను సద్వినియోగం చేసుకోండి
- టిడిపి సీనియర్ నాయకులు ఉల్లిగయ్య, జిల్లా ఉపాధ్యక్షులు చెన్నబసప్ప

ప్రజాశక్తి - కౌతాళం




ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజల కోసం చంద్రన్న బీమా వెబ్ సైట్ ప్రారంభించారని, సైట్‌ను సద్వినియోగం చేసుకోవాలని టిడిపి సీనియర్ నాయకులు చూడి ఉల్లిగయ్య, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు చెన్న బసప్ప కోరారు. మంగళవారం వారు మాట్లాడారు. మార్చి 16 నుంచి జూన్ 30 మధ్య జరిగే క్లయిమ్‌లను వెంటనే అప్‌లోడ్ చేయడానికి అన్ని డబ్లుఈఎ/డబ్ల్యుడబ్ల్యుడిఎస్‌కి ఉపయోగించుకోవాలని కోరారు. మార్చి నెల నుంచి జూన్ నెలలోపు మృతి చెందిన వారికి చంద్రన్న బీమా కింద డబ్బులు వస్తాయని తెలిపారు. మృతుని మరణ ధ్రువీకరణ పత్రం, నామిని ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ పాస్ బుక్ తీసుకొని గ్రామాల్లో ఉన్న సచివాలయంలో నమోదు చేసుకోవాలని వివరించారు.

సూర్యనారాయణపై అక్రమ కేసు ఎత్తేయాలి
- ఎపిజిఎ నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై పోరాడుతున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కెఆర్.సూర్యనారాయణపై గత వైసిపి ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసును ఎత్తేయాలని ఎపిజిఎ జిల్లా అధ్యక్షులు బంగి శ్రీధర్, ఆదోని అధ్యక్షులు రషీద్ డిమాండ్ చేశారు. మంగళవారం తుంగభద్ర దిగువ కాలువ కార్యాలయం నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గత వైసిపి ప్రభుత్వం తమ ఉద్యోగ సంఘం నేత సూర్యనారాయణపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడిందని విమర్శించారు. ఉద్యోగులకు రావాల్సిన బకాయిలపై ప్రభుత్వాన్ని నిలదీస్తే అక్రమంగా కేసులు పెట్టిందన్నారు. ఇంతవరకు సాక్ష్యాధారాలు, చార్జీసీటు కూడా సమర్పించలేదని తెలిపారు. 1న జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ గవర్నర్‌ను కలిసి విన్నవించామని ఇలాంటి కక్ష సాధింపు చర్యలకు పాల్పడిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం తమ నేతపై ఉన్న అక్రమ కేసును ఎత్తేయాలని కోరారు. అనంతరం సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మకు వినతిపత్రం అందజేశారు. కార్యదర్శి లక్ష్మీనారాయణ, నాగ రవి, ఎల్లయ్య, ఇందిరా, డోరతి, రాధాకృష్ణ, వేణు, చెన్నయ్య పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగులు

విద్యాహక్కు చట్టం ఉల్లంఘన
- పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలి
- సామాజిక కార్యకర్త, న్యాయవాది తిమ్మప్ప

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు



పట్టణంలో ఉచిత విద్యాహక్కు చట్టాన్ని ఉల్లంఘిస్తున్న భాష్యం, రవీంద్ర భారతి, మాంటిస్సోరి పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని న్యాయవాది, సామాజిక ఉద్యమ కార్యకర్త అడ్డాకుల తిమ్మప్ప కోరారు. మంగళవారం ఆయన మాట్లాడారు. విద్యాహక్కు చట్టం-2009 ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థులు ఉచిత విద్యను అభ్యసించేందుకు నోటిఫికేషన్ విడుదల చేసిందని తెలిపారు. దాని ప్రకారం అర్హులైన పేద విద్యార్థులకు ప్రయివేట్ పాఠశాలల్లో ఎలాంటి ఫీజులూ వసూలు చేయకుండా అర్హుల జాబితాను విడుదల చేసిందని చెప్పారు. విద్యాహక్కు చట్టం కింద ఆయా పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులను చేర్చుకోవాలని తెలిపారు. ఎమ్మిగనూరులోని ప్రయివేట్ పాఠశాలల్లో ఫీజు కడితేనే చేర్చుకుంటామని, లేకపోతే లేదని చెబుతున్నారని అన్నారు. విద్యాహక్కు చట్టం 12(1)సిని ఉల్లంఘిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థుల తల్లిదండ్రులను వేధిస్తున్న ప్రయివేట్ పాఠశాల ల గుర్తింపును రద్దు చేయాలని, లేకపోతే విద్యార్థుల తల్లిండ్రులు రోడ్డుపైకి వచ్చి ఉద్యమాలు చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి : ఎస్‌టియు

ప్రజాశక్తి - ఆస్పరి

ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు నాగేంద్రప్ప డిమాండ్ చేశారు. మంగళవారం ఎస్‌టియు సభ్యత్వ నమోదులో భాగంగా మండలంలోని కైరుప్పల ఎంపిపి పాఠశాలలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయుల సిపిఎస్, జిఒ 117ను రద్దు చేసి, 12వ పిఆర్‌సిని అమలు చేయాలని కోరారు. ఎస్‌టియు నాయకులు శ్రీనివాసులు, జ్యోతి మూర్తి, నాగరాజు, విశ్వనాథ్, రామాంజి, ఉరుకుంద పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి
- యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్ పాటి

ప్రజాశక్తి - ఆదోని

విద్యారంగంలో నెలకొన్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్ పాటి కోరారు. మంగళవారం ఆదోని యుటిఎఫ్ కార్యాలయంలో నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మున్సిపల్ ఉపాధ్యాయుల పిఎఫ్ సమస్య, నూతన అప్‌గ్రేడ్ అయిన ఉన్నత పాఠశాలల పోస్టుల మంజూరు, బదిలీలు, ప్రమోషన్లు కల్పించాలని కోరారు. మున్సిపల్ పాఠశాలలో పెరుగుతున్న విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పోస్టుల సర్దుబాటు, జిఒ 117ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల కోడ్ అమలులోకి రావడం వల్ల బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ నిలిచిపోయిందని తెలిపారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న పిఎఫ్ సమస్య ఇప్పటికీ పరిష్కారం కాలేదన్నారు. జిల్లా సహాధ్యక్షులు జీవిత, జిల్లా కార్యదర్శి గాదిలింగ, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ శ్రీనివాసులు, ఆడిట్ కమిటీ సభ్యులు మల్లికార్జున, యుటిఎఫ్ సీనియర్ నాయకులు కృష్ణమూర్తి, బసప్ప, నరసయ్య గౌడ్, నాయకులు నల్లారెడ్డి, రంగన్న, సుధాకర్ నాయక్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నవీన్ పాటి

ఆస్పరి : రాష్ట్రంలో ప్రాథమిక పాఠశాలలను విచ్ఛిన్నం చేస్తున్న జిఒ 117ను రద్దు చేయాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు దేవపాల్, నరసింహులు కోరారు. మంగళవారం యుటిఎఫ్ సభ్యత్వ క్యాంపెయిన్ సందర్భంగా ఆస్పరిలోని వివిధ పాఠశాలలను సందర్శించి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వ విద్యా రంగంలో సంస్కరణల పేరుతో గత ప్రభుత్వం అమలు చేసిన జిఒ 117తో విద్యారంగం లో అనేక ఇబ్బందులు ఎదురయ్యాయని తెలిపారు. పాఠశాలలను విలీనం చేయడం వల్ల ప్రాథమిక పాఠశాల వ్యవస్థ బలహీన పడిందని పేర్కొన్నారు. ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతులు కల్పించాల్సి వస్తుందన్న కారణంతో ఎస్‌జిటి పోస్టులను రద్దు చేయడంతో రాష్ట్రంలో 14 వేల ప్రాథమిక పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మిగిలాయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్, తెలుగు మీడియాలు కొనసాగించి, ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. మండలంలో చాలా పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా ఉన్నాయని, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అధికారులు స్పందించి ఏకోపాధ్యాయ పాఠశాలలకు ప్రత్యామ్నాయ మార్గాలు చూపాలని కోరారు. యుటిఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రంగన్న, బాబు, నాయకులు మోద్దీన్ బాష, పవన్ కుమార్ పాల్గొన్నారు.


ఆస్పరిలో మాట్లాడుతున్న యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి దేవపాల్


పశువులకు టీకాలు వేస్తున్న డాక్టర్ మహేష్

ముద్ద చర్మ వ్యాధి నివారణకు టీకాలు తప్పనిసరి : పశువైద్యులు

ప్రజాశక్తి - చిప్పగిరి

పశుసంపద ఉన్న ప్రతి ఒక్కరూ ముద్ద చర్మ వ్యాధికి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని పశు వైద్యులు ప్రసన్నబాయి, మహేష్ సూచించారు. మంగళవారం కుందనగుర్తి, ఏరూరు, నేమకల్లు, బెల్డోన గ్రామాల్లో పశువులకు టీకాలు వేస్తూ రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పశువులు అనారోగ్యంగా కనబడితే వెంటనే పశు వైద్యులకు చూపించాలని కోరారు. ఆలస్యం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి గ్రామంలోనూ ముద్ద చర్మ వ్యాధిపై రైతులను సమావేశ పరిచి అవగాహన కల్పిస్తామన్నారు. వెటర్నరీ సిబ్బంది నాగరాజు, నీలకంఠ పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకంతో అధిక లాభాలు
- ప్రోగ్రామ్ మేనేజర్ నారాయణ

ప్రజాశక్తి- దేవనకొండ

పండ్ల తోటల పెంపకంతో అధిక లాభాలు పొందవచ్చని ప్రోగ్రామ్ మేనేజర్ బి.నారాయణ తెలిపారు. మంగళవారం కప్పట్రాళ్ల గ్రామంలోని తానా స్త్రీశక్తి భవనంలో సేట్రీస్ ఆధ్వర్యంలో పండ్ల తోటల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పండ్లతోటల పెంపకం వైపు రైతులు అడుగులు వేయాలని తెలిపారు. రాబోయే రోజుల్లో కప్పట్రాళ్ల గ్రామాన్ని ఒక యూనిట్‌గా తీసుకొని హార్టికల్చర్ హబ్‌గా చేయడానికి ప్రయత్నిస్తున్నామని చెప్పారు. ఈ ప్రాంతం పండ్ల తోటల పెంపకానికి చాలా అనువైన ప్రాంతమని, ఇందులో భాగంగా కప్పట్రాళ్ల, బండగట్టు, నెల్లిబండ, కరివేముల, ఈదుల దేవరకొండ గ్రామాల్లోని రైతులను పండ్ల తోటల పెంపకం వైపు తీసుకెళ్తున్నామని తెలిపారు. రిసోర్స్‌పర్సన్ చింతమాను రవికుమార్, ఫీల్డ్ కోఆర్డినేటర్ సుధాకర్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నారాయణ

కురువలకు ఎస్సీ సర్టిఫికెట్ ఇవ్వాలి
- కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి - ఆలూరు

ప్రభుత్వం సుమోటోగా చేపట్టిన కుల ధ్రువీకరణ పత్రం జారీలో కురువలకు మదాసి/మదారి కురువ ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రం అందజేయాలని మదాసి/మదారి కురువ సంఘం రాష్ట్ర నాయకులు సుంకన్న కోరారు. మంగళవారం కలెక్టర్ రంజిత్ బాషాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కుల ధ్రువీకరణ పత్రంలో రెవెన్యూ అధికారులు కొన్నేళ్లుగా కురువ అని పిలవబడే మదాసి/మదారి కురువలకు, కురుబ/కురుమ అని బీసీగా కుల పత్రం అందజేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం సుమోటోగా కులధ్రువీకరణ పత్రంలో కుల మార్పిడి చేస్తుండడంతో తాము బహిష్కరిస్తున్నమని తెలిపారు. తమకు మదాసి, మదారి కురువగా కులధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని కోరారు. కలెక్టర్ స్పందిస్తూ... విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు. మనేకుర్తి గ్రామ మదాసి, మదారి కురువ నాయకులు సుంకన్న, ఎం.సురేష్, ఎం.నాగరాజు పాల్గొన్నారు.

ట్యాంకును పరిశీలిస్తున్న నాయకులు


ఎస్‌ఎస్ ట్యాంకు పరిశీలన

ప్రజాశక్తి - కౌతాళం

మండలంలోని రాజానగర్‌లో ఉన్న సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును తెలుగు రైతు సంఘం జిల్లా కార్యదర్శి అల్లూరి వెంకటపతి రాజు పరిశీలించారు. మంగళవారం ఫిల్టర్ బెడ్, మోటార్లు, ఆలం మోటార్లు సరిగ్గా పని చేస్తున్నాయా లేదా అని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారిని అడిగి తెలుసుకున్నారు. నీటి సరఫరా చేయడానికి ఎటువంటి సమస్యలు వచ్చినా తెలియజేయాలని ఆయన కోరారు. ఇప్పటి నుంచి నీటిని బాగా ఫిల్టర్ చేసి వరుస ప్రకారంగా వివిధ గ్రామాలకు సరఫరా చేయాలని తెలిపారు. టిడిపి నాయకులు రాజానంద్, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి రాజబాబు, తెలుగు యువత నాయకులు గొట్టయ్య, వలీ పాల్గొన్నారు.

మద్దికెర నుంచి చింతకుంట వరకు
తారు రోడ్డు వేయాలి
- మంత్రికి మాజీ జడ్‌పిటిసి వినతి

ప్రజాశక్తి - చిప్పగిరి


మంత్రి బీసీకి వినతిపత్రం అందజేస్తున్న టిడిపి నాయకులు

పత్తికొండ నియోజకవర్గంలోని మద్దికెర నుంచి ఆలూరు నియోజకవర్గంలోని చిప్పగిరి మండలం మీదుగా చింతకుంట వరకు తారు రోడ్డు వేయాలని నాయకులు కోరారు. మంగళవారం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి బీసీ.జనార్ధన్ రెడ్డిని మాజీ జడ్‌పిటిసి ఏరూరు మీనాక్షి నాయుడు, టిడిపి యువ నాయకులు ఏరూరు హరి, మాజీ ఎంపిటిసి నరసింహులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. చిప్పగిరి మండలం ఏరూరు నుంచి చింతకుంట వరకు తారు రోడ్డు పూర్తిగా ధ్వంసమై గుంతలు, రాళ్లు ఏర్పడి రాకపోకలకు పూర్తి అంతరాయం ఏర్పడిందని తెలిపారు. మద్దికెర నుంచి చింతకుంట వరకు తారు రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు. రోడ్డు ఏర్పాటు చేయిస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు.

సుంకం వసూలుకు వేలం
- కమిషనర్ రామచంద్ర రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని



ఆదోని మున్సిపాలిటీకి చెందిన ఝాన్సీలక్ష్మి బాయి కూరగాయాల మార్కెట్, పశువుల, గొర్రెల సంతలకు సంబంధించి సుంకం వసూలుకు ఈనెల 16న ఉదయం 11 గంటలకు ఆదోని మున్సిపల్ ఆఫీసులో వేలం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రామచంద్రరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడారు. ఆగస్టు 1, 2024 నుంచి మార్చి 31, 2025 వరకు సుంకం వసూలుకు కాంట్రాక్టు కాల వ్యవధి ఉంటుందన్నారు. ఆసక్తి గల వారు వేలంలో పాల్గొనాలని కోరారు.